# కష్టేఫలీ

పెళ్లైన కొత్తలో భార్యలేమడిగినా భర్తలు తప్పక తీరుస్తారంటారు. అది కొత్త పెళ్లామన్న మోజుకావచ్చు; తన కోసం అందర్నీ, అన్నిటినీ వదులుకు వచ్చిందన్న అభిమానమూ కావచ్చు. ఏమైతేనేమి కానీ అడిగింది కాదనడం జరగదు. సాధారణంగా జాణలైన ఆడవాళ్ళు ఈ సమయంలోనే తమకు కావల్సిన చీరలూ, నగలూ, ఇంటికి కావాలనిపించిన సామానూ కొనిపించుకుంటారు. కానీ మా ఆవిడ పెళ్ళైన కొత్తలో నన్నోచిత్రమైన కోరిక కోరింది. మాకు పుట్టబోయే అబ్బాయినీ, అమ్మాయినీ ఒక్కలాగే పెంచాలని. నాకు చాలా ఆశ్చర్యంగా అన్పించింది. ఆమాటే అన్నానావిడతో ఇదేం కోరికని. ఆవిడ ఆవేదనగా జవాబిచ్చింది.

"మీకు తెల్సుగా వేం నల్గురమ్మాయిలమూ, ఇద్దరబ్బాయిలూను. మా అన్నయ్యలిద్దర్నీ ఒక్కలా, మమ్మల్ని వేరేలా చూసేది మా అమ్మ. మాది మధ్యతరగతి కుటుంబం. అయినా ఉన్నంతలో తిండి దగ్గర్నుండీ వేరే. వాళ్లకి పెరుగూ, కూరా రోజూ వుండేవి. మాకు మజ్జిగ, నెలచివరైతే పచ్చడి మెతుకులే. ఎంత ఆవారాగా తిరిగినా, ఫెయిలయినా వాళ్ల చదువులాపలేదు. స్కూలు ఫస్టు వచ్చినా నన్ను టెన్త్‌తోనే ఆపేశారు. అందుకే చిన్నప్పట్నించీ నేను అనుకునేదాన్ని నాకు పుట్టే పిల్లల్ని సమంగా చూస్తానని. కానీ దానికి మీ సహకారంకూడా ఉండాలి. అందుకే నాకోరిక మనస్సు విప్పి చెప్పేను"

నేను సన్నగా నవ్వేను.

"నీ కోరిక నామనస్సులో ఉన్నదే. మా ఇంట్లో ఆడపిల్లలు అపురూపంగా పెరిగేరు. మా అమ్మ స్త్రీ జనోద్ధమ నాయకురాలు. తనకి చిన్నప్పుడు ఆడపిల్లవడంవల్ల అన్యాయం జరిగిందని ఆవిడ ఉద్దేశం. అందుకే మా అక్క చెల్లెళ్ల హక్కుల కోసం ఆవిడ నిత్యం పాటుపడేది. ఆడా, మగా తేడా ఉండకూడదని మాచేత ఇంట్లో అంట్లు తోమడం దగ్గర్నుంచీ చేయించేది. కానీ చిత్రమేమిటంటే ఇంట్లో ఆడపిల్లలు బజారుపనీ, రైల్వే రిజర్వేషన్లు వంటిపనులూ చేసేవారుకాదు. దాంతో మాకు అన్యాయంగా అన్పించేది. అంతెందుకు ఇంట్లో ఏశుభకార్యమైనా అన్నతమ్ములమంతా తలో వెయ్యినూట పదార్లూ మంగళారతి పళ్లెంలో వెయ్యాల్సిందే. అందుకే ఆడపడుచులొస్తున్నారంటే ఇంటి కోడళ్లు కాదు. కొడుకులంమేమే హడలిచస్తాం. అందుకే నేను ఆడపిల్లైనా అతి గారం చెయ్యకూడదనుకున్నాను. నీ కోరికా, నాకోరికా ఒక్కటే కాబట్టి ఇంకేమైనా అడుగు"

అడగడానికేం లేవన్నట్లు ఆవిడలేచి లోపలికి వెళ్ళిపోయింది.

ఆ సమయంలో ఇద్దరూ అమ్మాయిలో, అబ్బాయిలో అయితే ఎలా అన్న ఆలోచన మా ఇద్దరికీ రాలేదు.

❖ ❖ ❖

మా కోరిక తీర్చడం తనకీ ఇష్టమే అని దేవుడన్నట్లుగా మాకు అబ్బాయి, రెండేళ్ళతర్వాత అమ్మాయీ పట్టేరు. అశోక్, అనిత అని పేర్లు పెట్టుకున్నాం.

ఇద్దరికీ ఒకే ఖరీదులో బట్టలు కొనేవాళ్ళం. ఇద్దరికీ ఒకేలా పుట్టినరోజు వేడుకలు చేశాం. ఇద్దర్నీ ఒకేస్థాయి ఉన్న స్కూళ్ళలో వేశాం. ఒకేలా చాక్లెట్లూ, స్వీట్లూ, పళ్ళూ కొని పెట్టేవాళ్ళం. అఖరుకి భోజన సమయంలో చివరి అప్పడం కూడా సమంగా విరిచి ఇద్దరికీ పెట్టేవాళ్ళం. తులాభారంలో ఏమాత్రం తేడా వచ్చినా ఒకళ్ళనొకరం హెచ్చరించుకునేవాళ్ళం. పిల్లల పెంపకం అలా ఛాలెంజిగా తీసుకున్న మాకు ఎంతో తృప్తిగా సంతోషంగా వుండేది.

కానీ మా అబ్బాయికి పదేళ్ళూ, అమ్మాయికి ఎనిమిదీ వచ్చేసరికి తులాభారం డ్యూటీ వాళ్ళు తీసుకున్నారు. అనుక్షణం అమ్మా, నాన్నా రెండోవాళ్ళకి ఎక్కువ చేసేస్తున్నారేమోనని చూస్తూ ఉండేవారు. అప్పడే మాకష్టాలు మొదలయ్యేయి.

❖ ❖ ❖

మా అశోక్‌కి టేబిట్ టెన్నిస్ స్కూల్లో నేర్పడం మొదలెట్టేరు. నాక్కూడా స్పోర్ట్స్ ఇష్టం మూలాన ఇంట్లో డైనింగు టేబిల్ మీదనే అటతో మెలకువలు నేర్పసాగేను. వాడికి అట బాగా రావడం మొదలైంది. అందుకే ఆఫీసు కాంపునుంచి తిరిగి వస్తూ వాడికి మంచి బ్యాటు నూటయాభై రూపాయలెట్టి కొన్నాను. అమ్మాయికి అదే ఖరీదులో చిన్న బార్బీడాల్‌కొన్నాను. ఇంటికి రాగానే వాడు చాలా మురిసిపోయి బ్యాటు ఫ్రెండ్సుకి చూపించుకుందుకు పరిగెత్తేడు. అనిత మూతి ముడుచుకుంది.

"ఏం అనితా, బొమ్మ నచ్చలేదా?"

"వాడికి మంచి బ్యాటు తెచ్చేరు. హాయిగా ఆడుకుంటాడు"

" చూడు వాడి బ్యాటూ, నీబొమ్మా ఒక్కటే ఖరీదు. ఇద్దరికీ సమంగానే తెచ్చేను" బిల్లులు చూపించేను.

మా అమ్మాయి మొహంలో ప్రసన్నత లేదు.

"బ్యాటుతో హాయిగా ఆడుకోవచ్చు. బొమ్మేం చేసుకోవాలి. ఒళ్లో పెట్టుక్కూచోవాలి. అంతేలెండి నాన్నా, మగపిల్లలు స్పోర్ట్స్‌లో ఫస్టు రావాలి. ఆడపిల్లలు చప్పట్లు కొట్టాలి.

టీ.వీ.అడ్వర్టైజుమెంట్లూ అంతే జీవితాలూ అంతే" ఎనిమిదేళ్ళ పిల్ల సినిమా డైలాగులు అప్పచెప్పింది.

టీ.వీ.లో ఆడపిల్లలకన్యాయం అన్న ప్రోగ్రాం చూసిందో, లేక మా అమ్మ పోలిక వచ్చిందో కానీ అశోక్‌కన్నా తనకి అన్నీ తక్కువని దాని అభిప్రాయం.

"నీకింకా టేబిలు టెన్నిస్ రాదుకదా. నీకేం తోని ఉండాల్సిందంటావు?"

"ఏమో నాకు తెలియదు. చిన్నపిల్లని కదా"

నేను అయోమయంగా చూశాను.

❖ ❖ ❖

పిల్లలిద్దరికీ ఇష్టమని మా ఆవిడ బంగాళాదుంపలు ఎక్కువగా వేపుడు చేస్తూ ఉంటుంది. ఇద్దరికీ గరిటెతో సమంగా వడ్డించింది. ఈలోగా ఎదురింటావిడ పిలవడంతో ఇద్దర్నీ తింటూండమని గేటు దగ్గరికి వెళ్ళింది. నేను టీ.వీ.లో వార్తలు చూస్తున్నాను. ఇద్దరి గొంతుకలూ టీ.వీ. సౌండుకన్నా గట్టిగా వినిపించాయి. "ఇరవై నాలుగూ", "ఇరవై మూడూ" ఏవో అంకెలు. అబ్బ ఏమిటి అన్నాల దగ్గరకూడా లెక్కలు చేస్తున్నారా?

ఆనందంతో డైనింగు టేబిలు దగ్గరకు వెళ్ళేను. ఈలోగా మా ఆవిడా వచ్చింది. పిల్లలిద్దరూ కంచాల్లోని బంగాళాదుంప ముక్కలు లెక్కెడుతున్నారు. ప్రాణం ఉసూరుమంది.

"నీవి ఇరవై నాలుగు. నాకు ఇరవై రెండే వచ్చాయి. నాకో ముక్క ఇయ్యి"

"ఇది ముక్కకాదు. కూరలో చిన్న ముద్దలాంటిది. అయినా నీముక్కలు పెద్దవి. నువ్వే ఇయ్యి"

"ఏం కాదు. ఇదిగో నాకు ముద్ద ఇక్కడ వచ్చింది. నీ ముక్కలే పెద్దవి"

ఇద్దరూ తారాస్థాయిలో వాదించుకుంటున్నారు. మా ఆవిడకు కోపం నసాలాన్ని అంటింది. నేను తీర్పు చేప్పే ఉద్ధేశంతో "అశోక్, గొడవెందుకు? హాయిగా భోంచెయ్యండి" అన్నాను.

"అదీ అలా చెప్పండి' అన్నట్లు అనిత నవ్వింది.

"అంతే నాన్నా దానికెక్కువ వచ్చినా ఎవరూ పట్టించుకోరు. చిన్నపిల్లదానికే ఇచ్చెయ్యి అంటారు. ముందు పుట్టడం మహాపాపం"

చైల్డ్ సైకాలజీలో సిబ్లింగ్ రైవల్రీ ముఖ్యమైనది. నాకు ఏం చెయ్యాలో తెలియలేదు. ఈలోగా మా ఆవిడ అందుకుంది.

"ఇద్దర్నీ ఎంతసమంగా చూస్తున్నానో అంతగా రెచ్చిపోతున్నారు. మా అమ్మ పద్ధతే రైటు. మగపిల్లలకి చక్కగా పెట్టి, మా నోళ్ళు నొక్కేసేది. చైనా యుద్ధం టైంలో మద్రాసులో బియ్యం దొరికేవు కావు. 'మా అన్నయ్య ఉప్పపిండి కావాలని పేచీ పెట్టేడు. నాలుగు గుప్పిళ్ళు బియ్యం విసిరి గుప్పెడు పెసరపప్పు వేసి, ఉప్ప పిండి చేసి అన్నయ్యలిద్దరికీ పెట్టింది. మాకు తరవాణి అన్నం. అలా చేస్తే తెలుస్తుంది. ఆడపిల్లవి అంట్లు తోమి, అవకాయన్నం తిను అంటే కానీ నీకు బుద్ధిరాదు అనితా"

తల్లికి కోపం వచ్చిందని తెల్సిన పిల్లలు నోరెత్తలేదు. మా ఇద్దరికీ విపరీతమైన నీరసం వచ్చింది.

❖ ❖ ❖

బొమ్మల దగ్గరా, భోజనాల దగ్గరా ఆగితే బావుండేదేమో మా పిల్లల తులాభారం. దిన చర్యలో అనుక్షణం పోట్లుకుంటూ ఉండేవారు. ఇంట్లో పని ఎక్కువగా ఉన్నప్పుడు ఇద్దరూ పోట్లుకుంటూ ఉంటే చాలా చిరాకు వచ్చేది.

స్నానం అష్టభోగాల్లో ఒకటంటారు. కానీ పిల్లలకు - అందునా మా పిల్లలకు స్నానం పనిష్మెంటుకింద లెక్క పొద్దుట నీళ్లు పోసుకోవడం దగ్గర రోజా యుద్ధమైపోతుంది.

"అనితా! నీళ్ళు పోసుకో. స్కూలికి టైమైపోతోంది"

"వాణ్ణి పోసుకోమను" బ్రేక్‌ఫాస్ట్ టీ.వీ. ముందున్న అనిత అరుపు.

"అశోక్ నీళ్ళు పోసుకో"

"దాన్ని పోసుకోమను" పేపర్‌లో స్పోర్ట్స్ కాలం చూస్తున్న అశోక్ జవాబు.

"ఇద్దర్లో ఎవరో ఒకరు పోసుకోకుండా ఏమిటీ గొడవ? ఏమండీ మీరేం చేస్తున్నారం"టూ వంటింట్లోనుంచి మా ఆవిడ కేకేసింది. నరే నాడ్యూటీ నేను చెయ్యాలనుకుంటూ "ఏయ్ అశోక్ నీళ్ళు పోసుకో" అన్నాను.

"నేనే ఫస్టు పోసుకోవాలా? దాని స్కూలు ముందు. అదే పోసుకోవాలి"

నాకోపం నసాళాన్ని అంటింది.

" వెధవా అన్నిటికీ ఈ పోటీ ఏమిటి? నిన్నేమైనా రాళ్లెత్తమన్నానా? స్నానానికింత గొడవేమిటి. ఇలారా" అంటూ నా ఎదురుగా నిలబెట్టి తిట్టేను. ఏమనుకుందో టీ.వీ. ముందునుంచి లేచి వచ్చి మా అమ్మాయి కూడా అన్న పక్కన నిల్చుంది. చేతులు కట్టుకుని అన్నతో సమానంగా తిట్లు పంచుకుంటున్న అనితనీ, దాని న్యాయబుద్ధినీ

చూస్తే నాకెంతో ముచ్చటేసింది. కోపం మర్చిపోయేను. సమంగా తల్లి దండ్రులు చూస్తే సమంగా ఉండాలన్న కోరిక పెరుగుతుందా?

స్కూళ్ళల్లో ఫ్రెండ్సుతో ఎలా ఉండే వారో కానీ ఇంట్లో మాత్రం అనుక్షణం దెబ్బలాడుకోడమే వాళ్ళకి హాబీగా ఉండేది. ఇన్‌డోర్‌గేమ్స్ వానాకాలంలో పనికొస్తాయని కేరమ్సు బోర్డు కొన్నాము. ఇద్దరే అయితే కొట్టుకుని కాయిన్స్ విసిరేస్తారేమోనని మేమిద్దరమూ కూడా ఆడేవాళ్ళం. మా ఆవిడకు ఆట అంతగా రాదు. అందుకే ఇద్దరూ నావైపే ఉంటామనేవారు. పిల్లలిద్దర్లో పెద్దవాడు కాబట్టి అశోక్‌కి కొంచెం వచ్చు అందుకే తల్లి వైపువాణ్ణీ, నావైపు అనితనీ పెట్టి ఆడేవాళ్ళం. రోజూ ఫస్టు ఎవరాడాలన్నది పెద్ద యుద్ధం. అనితని ఫస్టంటే చిన్న పిల్ల గారాం చేస్తారనేవాడు అశోక్. అశోక్ మొదలంటే మగపిల్లవాడికే అన్నీ అనేది అనిత. ఒకరోజు ఒకళ్ళూ, ఇంకో రోజు ఇంకోళ్ళూ' అని రూల్సు పెట్టేము. ముందు రోజు ఎవరు ఫస్టో జ్ఞాపకంమాకుండేది కాదు. దాంతో ఇద్దరూ కొట్టుకొనేవారు. ఆట మొదలయ్యేదికాదు ఎవరు మొదలో తెలియక.

మేం ఇద్దర్నీ సమంగా చూడగలంకానీ వాళ్ళు అన్నిటిలో సమంగా ఉండాలని లేదుకదా. అనితకు చదువంటే శ్రద్ధ ఉండేదికాదు. కాలనీలో దానికి తెలియని వాళ్ళలేదు. ఎప్పుడూ ఫ్రెండ్సుతో ఆడుతూ ఉండేది. హోంవర్కు చేయించే సరికే మా తలప్రాణం తోకకొచ్చేది. విసుగొచ్చినరోజున మా ఆవిడ "చదువు కుంటావా అంట్లు తోముకుంటావా" అని తిట్టేది. ఏబెదురూ లేకుండా "అంట్లే తోముకుంటాను. నువ్వు పనిమనిషంటే ఎంత భయపడతావు. డాడీకి కూడా అంత భయపడవు" అని జవాబిచ్చేది అనిత. మా ఆవిడకు హోం వర్కు చేయించలేక నీరసం వచ్చేక నేనూ ప్రయత్నించేవాణ్ణి. మొత్తానికి సాయంపట్టేవాళ్ళం.

ఒక రోజు సాయంత్రం అనితకెంతో ఇష్టమైన పనస తొనలు కొనుక్కొచ్చాను. ఆరోజున నేనింటికొచ్చేసరికి తల్లీ, కూతురూ కలిసి హోంవర్కు చెయ్యడంలో ఇంటిని రణరంగంలా చేస్తున్నారు. "నేను చేయిస్తాలే నువ్వెళ్ళు. పని చూసుకో" అని మా ఆవిడతో అని - "అనితా! అరగంటలో హోంవర్కు చెయ్యి. నీకు ఇష్టమైన పనసతొనలు తిందువుగానీ" అన్నాను.

అరగంటకి అరులైన్లన్నా రాయలేదు అనిత.

"అనితా! ఆఖరుసారిగా చెప్తున్నాను. ఇంకో అరగంటలో హోంవర్కు చెయ్యకపోతే నీకు పనసతొనలుండవు" ఇంకో అరగంటయినా చెయ్యలేదు అనిత. తండ్రి తనకు పెట్టకుండా ఉండడన్న ధీమాయేమో.

రాత్రి భోజనాల దగ్గర పెద్దగా ఎవరూ మాట్లాడుకోలేదు. భోజనాలయ్యేక తనంత తను హోంవర్కు చేస్తుందేమో అని చూశాను. టీ.వీ. ముందు కూచుంది. "దండం దశగుణం భవేత్" అన్నారు. ఎలాగైనా అనితని దారిలో పెట్టాలి. డజను కొన్నాను

పనసతొనలు నలుగురికీ నాలుగు మూళ్ళని. కానీ మూడు భాగాలు చేసి మా ఆవిడకీ, అశోక్‌కి నాలుగేసి ఇచ్చి నేను నాలుగు తీసుకున్నాను. "టీ.వీ. ఆపేసి పోయి పడుకోండి" అన్నాను. ఇద్దరూ వెళ్ళిపోయారు వాళ్ళ బెడ్రూంలోకి. మా ఆవిడ మళ్ళీ టీ.వీ. పెట్టుకుంది. నేను లోపలికి వెళ్ళి పడుకున్నానుకానీ మనస్సు బాధపడుతోంది. అనితకి పనసతొనలిష్టం. చదివించాలంటే ఇది మార్గం కాదేమో.

పడుకుందో, ఏడుస్తోందో చూద్దామని దొడ్డి గుమ్మం తీసుకుని మెల్లిగా పిల్లల బెడ్రూం కిటికీ దగ్గరకి వెళ్ళేను. ముందు తలుపు తేసుకుని మా ఆవిడా ఆటైంకే అక్కడకు వచ్చింది. కిటికీలో నుంచి కన్పించిన దృశ్యం మమ్మల్ని ఆశ్చర్యంలో, ఆనందంలో ముంచెత్తింది.

"బాగా చదువుకో అనితా ఎందుకిలా బిహేవ్ చేస్తున్నావు"

"రేపటి నుంచి బాగా చదువుతాను. నాన్న ఇంతగా పనిష్ చేస్తారనుకోలేదు"

నేనిచ్చిన నాలుగుపనసతొనల్లో రెండు అనితకిచ్చి, రెండే తను తింటున్నాడు. మేం చూడకుండా దాచి తెచ్చినట్లున్నాడు. అన్నయ్యని తిడుతూంటే పక్కన నిల్చున్న అనిత జ్ఞాపకమొచ్చింది. తోబుట్టువులన్న మాట రూపం దాల్చినట్లున్నారిద్దరూ.

మా కళ్లల్లో ఆనందాశ్రువులు తిరిగేయి. మెల్లిగా మా గదిలోకి వచ్చి కూచున్నాం.

"ఉప్పూ, నిప్పులా ఉంటారిద్దరూ. ఇంత అభిమానాలున్నాయా ఇద్దరికీ" అంది మా ఆవిడ.

"పిల్లలు తల్లిదండ్రుల ప్రేమకోరుకున్నంతగా ఇంకేమీ కోరుకోరు. అది మిగతా పిల్లలకి ఎక్కువ దొరుకుతుందేమోనన్న భయం వారిలో అనుక్షణం ఉంటుంది. ఒకళ్ళని ఎక్కువగా చూస్తే మిగతావాళ్ళకి ఆపిల్ల లేదా పిల్లాడిమీద అసూయ బయల్దేరి ఒక్కోసారి ద్వేషంగా మారుతుంది.

మన పిల్లలు ఎంత తులాభారం వేసి చూసినా మనం వారిద్దర్నీ సమంగా చూస్తున్నామన్నది వాళ్ళకి అనుక్షణం తెలుస్తూనే ఉంటుంది. అమ్మా, నాన్నల ప్రేమ సమంగా పంచుకుంటున్నామన్న భావం వారిని మరింత దగ్గర చేస్తుంది. అలా లేదన్నప్పుడే ద్వేషాలు మొదలవుతాయి. సమంగా చూడ్డం కష్టం. ఎవర్నో ఒకర్ని వెనకేసుకురావడం సులువు.

మనం కష్టమైన మార్గం ఎన్నుకున్నాం. పిల్లల తులాభార పరీక్షలో నెగ్గుతున్నాం. మంచి ఫలితం అనుభవిస్తున్నాము." అన్నాన్నేను.

"ఫలితం మామూలుది కాదు. శాశ్వత ఫలితం. వాళ్ళు జీవితాంతం ఇలా ప్రేమగానే ఉంటారని నా మనస్సు చెప్తోంది" అంది మా ఆవిడ.

(స్వాతి మంత్లీ)